నేటి నుంచి సీతారామరాజు కళాపరిషత్ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వానపు నాటిక పోటీలు

ఇక పేదల ఆకలి తీరినట్టే!



కాకినాడలో తిరిగి ప్రారంభంకానున్న అన్నక్యాంటీన్



తునిలో ప్రారంభించడానికి సిద్ధమవుతున్న అన్నక్యాంటీన్

- ఆగస్టు 15 నుంచి జిల్లాలో అన్నక్యాంటీన్లు పునఃప్రారంభం
- తొలిదశలో కార్పొరేషన్, మున్సిపాల్టీల్లో 11 క్యాంటీన్లు ఏర్పాటు
- గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో అయిదేళ్లుగా ఆగిపోయిన అన్నక్యాంటీన్లు
- తిరిగి కూటమి సర్కారు రావడంతో మళ్లీ పేదల ఆకలి తీర్చేందుకు నిర్ణయం
- పాడుబడ్డ పాత క్యాంటీన్ భవనాలను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు
- ఇప్పటికే మొత్తం రూ.1.50కోట్లతో మరమ్మతులకు అంచనాలు పూర్తి
- మూడు పూటలా భోజనం సరఫరా చేసే కంపెనీ ఈనెల 22 తర్వాత ఖరారు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

పేదల ఆకలి తీర్చే అన్నక్యాంటీన్లు జిల్లాలో తిరిగి మరి కొద్దిరోజుల్లో పునఃప్రారంభం కానున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ కడుపు మంట కారణంగా ఐదేళ్లనుంచీ మూలనపడ్డ క్యాంటీన్లు తిరిగి తెరుచుకోబోతున్నాయి. ఈ మేరకు ఆగస్టు 15 నుంచి వీటిని తిరిగి ప్రారంభించడానికి కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. అందులోభాగంగా తొలివిడతలో జిల్లాలో 11 క్యాంటీన్లను ప్రభుత్వం ప్రారంభించాలని నిర్ణయించింది. మళ్లీ మునుపటిలా మూడు పూటలు పేదలు కడుపు నిండా క్యాంటీన్లలో భోజనం చేయవచ్చు. కాగా ఎక్కడికక్కడ మూలనపడ్డ పాత అన్నా క్యాంటీన్ల భవనాలకు తిరిగి మరమ్మతులు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే వీటి మరమ్మతులకు అన్ని క్యాంటీన్లకు కలిపి రూ.1.50కోట్ల వరకు ఖర్చవుతుందని ఆయా మున్సిపల్ కమిషనర్లు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. భోజనం సరఫరా చేసే కంపెనీ ఏదనేది ఈనెల 22 తర్వాత తేలనుంది.

కడుపు మంటతో కనిపించనివ్వలేదు..

జిల్లాలో అనేకమంది నిరుపేదలు, చిరుద్యోగులు వివిధ అవసరాల కోసం తరచూ గ్రామాలనుంచి జిల్లా కేంద్రానికి వస్తుంటారు. ఆటోడ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు పట్టణాల్లో చాలీచాలని ఆదాయంతో బతుకులీడుస్తుంటారు. జిల్లాకు పెద్దదిక్కయిన జీజీహెచ్‌కు సైతం ఎక్కడెక్కడి నుంచో వైద్య సేవలకోసం వస్తుంటారు. వీరంతా ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం తినడానికి ఖర్చులు ఎక్కువై ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడాన్ని గమనించిన టీడీపీ 2014లో అన్నా క్యాంటీన్లను ప్రారంభించింది. పట్టణాలు, నగరాల్లో వీటిని ఏర్పాటు చేసి మూడుపూటలా భోజనాన్ని రూ.5కే అందించింది. వీటికి తక్కువ సమయంలో భారీ ఆదరణ లభించింది. ఎక్కడెక్కడి నుంచో జిల్లా కేంద్రానికి వచ్చిన వారు తక్కువ ధరకు రుచికరమైన భోజనాన్ని ఆరగించేవారు. ప్రధానంగా మధ్యాహ్నం వేళల్లో నిరుపేదలు, కార్మికులు, కూలీలు, విద్యార్థులు సైతం అన్న క్యాంటీన్లకు వచ్చి కడుపు నిండా భోజనం తినేవారు. దీంతో వీటికి అనూహ్య ఆదరణ లభించింది. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్నాక్యాంటీన్లపై పగబట్టింది. వీటి ద్వారా టీడీపీకి మంచి పేరు వచ్చిందన్న కడుపు మంటతో వీటిని రద్దు చేసేసింది. ఆ భవనాల్లో సామగ్రిని దూరంగా తీసుకువెళ్లి పారేసింది. భవనాలను ఖాళీగా మార్చేసింది. మరికొన్నింటిని ఇతర అవసరాలకు వాడేసుకుంది. దీంతో గడచిన అయిదేళ్లలో అన్నాక్యాం టీన్లు లేక కార్పొరేషన్, మున్సిపాల్టీల్లో పేదలు, చిరుద్యోగులు అనేక ఇబ్బందులు పడ్డారు. బయట హోటళ్లలో భారీగా ధర వెచ్చించి తినలేక చిన్నచిన్న తోపుడు బండ్లను ఆశ్రయించే వారు. అయినా ఆకలి తీరక ఇబ్బంది పడేవారు. దీంతో జగన్ ప్రభుత్వ నిర్వాకంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. పేదల కడుపు నింపే అన్నాక్యాంటీన్లను తీసేయడం దారుణం అంటూ ఆందోళనలు వ్యక్తమయ్యాయి. దీంతో అన్న క్యాంటీన్లను ప్రజలు మర్చిపోయేలా చేయడానికి జగన్ ప్రభుత్వం ఆర్భాటంగా ఆహా కేంద్రాలను తెరిచింది. వీటిల్లో ధర ఎక్కువగా ఉండడం, ఆహారం రుచిగా ఉండకపోవడం, వీటి చిరు నామా ఎక్కడుందో కూడా తెలియక వీటి గురించి జనాలకు తెలియలేదు.దీంతో ఈ సెంటర్లు కనుమరుగయ్యాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి అన్నాక్యాంటీన్లను తెరిపిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీఇచ్చారు. దానికి తగ్గట్టుగానే సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే సంతకం చేసి మాట నిలబెట్టుకున్నారు.

మళ్లీ కళకళ..

ఆగస్టు 15 నుంచి తిరిగి జిల్లాలో అన్నక్యాంటీన్లను పునరుద్ధరించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఆరోజు నుంచి మూడుపూటలా ప్రజలు తక్కువ ధరకు నాణ్యమైన భోజనం చేయడానికి వీలుగా ప్రభుత్వం ఏర్పాట్లు ముమ్మరం చేస్తోంది. తొలివిడత కింద జిల్లాలో 11 క్యాంటీన్లు ప్రారంభించాలని తాజాగా ఆదేశాలు జారీ చేసింది. కాకినాడ కార్పొరేషన్ పరిధిలో అయిదు ఏర్పాటు చేస్తున్నారు. అయిదు క్యాంటీన్లు టీడీపీ ప్రభుత్వంలో నిర్మించినవే. కానీ అయిదేళ్లుగా వీటిని మూసేయడంతో పాడైపోయాయి. ఈ నేపథ్యంలో ఆగస్టు 15 నుంచి వీటిలో తిరిగి క్యాంటీన్లు ప్రారంభించనుండడంతో యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయనున్నారు. ఇందుకు రూ.40.20లక్షలు వ్యయం అవుతుందని అంచనా కట్టారు. వీటిలో ఐవోటీ పరికరాలు, సాఫ్ట్‌వేర్ కోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. తుని, సామర్లకోట, పిఠాపురం, పెద్దాపురం మున్సిపాల్టీల్లో ఒక్కో అన్నక్యాంటీన్ తెరవాలని నిర్ణయించారు. వీటికి కూడా రూ.7.50లక్షల నుంచి రూ.8.75లక్షల వరకు నిధులు వెచ్చించి మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. నగర పంచాయతీలైన ఏలేశ్వరం, గొల్లప్రోలులోను పాత భవనాలను తిరిగి ఆధునికీకరిస్తున్నారు. ఇప్పటికే వీటి మరమ్మతులకు టెండర్లు కూడా పిలిచారు. ఈనెలాఖరుకు పూర్తిగా వీటిని ముస్తాబు చేయనున్నారు. మరోపక్క అన్న క్యాంటీన్లకు మూడుపూటలా తక్కువ ధరకు అల్పాహారం, భోజనం సరఫరా చేసే సంస్థను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. ఆసక్తిగల వాటి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ టెండర్లు పిలిచింది. ఈనెల 22కి కంపెనీని కూడా ఖరారు చేయనున్నారు. మరోపక్క ఇకపై నిరంతరం అయిదేళ్లపాటు క్యాంటీన్లు నడిచేలా ప్రభుత్వం అన్నాక్యాంటీన్ల పేరుతో ప్రత్యేక ట్రస్టు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. దీనికి ప్రజలు, కంపెనీలు, సంస్థల నుంచి విరాళాలు కూడా సేకరించాలని తలపోస్తోంది. తద్వారా అన్న క్యాంటీన్లకు ఎన్ని వేలమంది వచ్చినా భోజనం రూ.5కే అందించేందుకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ముందుచూపుతో వ్యవహరిస్తోంది.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..



పైపుల ద్వారా విడుదలవుతున్న గోదావరి జలాలు



ఏలేరులోకి చేరిన గోదావరి జలాలు

- నాలుగున్నరేళ్ల తర్వాత ఏలేరుకు చేరిన గోదావరి నీరు
- వైసీపీ హయాంలో పూర్తిగా పక్కకు..
- కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ మొదలు
- జగ్గంపేట మండలం రామవరం వద్ద పురుషోత్తపట్నం ఫేజ్-2 ద్వారా నీటి తరలింపు
- 53వేల ఎకరాలకు సాగునీటి సరఫరా
- మెట్ట రైతుల్లో వెల్లివిరిసిన సంతోషం

ఏలేశ్వరం, జూలై 10: నాలుగున్నరేళ్ల తర్వాత గోదావరి జలాలు తిరిగి ఏలేరుకు బుధవారం చేరుకున్నాయి. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.1600కోట్లతో పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేశారు. అప్పట్లో రెండు విడతల్లో గోదారి జలాలను ఏలేరుకు తరలించే ఏర్పాటు చేశారు. కానీ వైసీపీ పాలనలో ఈ పథకాన్ని పాలకులు నీరుగార్చారు. హరిత ట్రిబ్యునల్ ఆదేశాలతో నిలిపివేశారు. తర్వాత గ్రీన్ ట్రిబ్యునల్ అభ్యంతరాలు పరిష్కరించేందుకు, వారి సందేహాలను తొలగించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కేవలం టీడీపీ హయాంలో నిర్మించిన ప్రాజెక్టు అనే రాజకీయ కారణంతోనే దీన్ని పక్కనపెట్టారు. వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతో ఐదేళ్లుగా రైతులకు అవస్థలు తప్పలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నెలరోజుల వ్యవధిలోనే ఎన్‌జీటీ సందేహాలను తీర్చడంతోపాటు పథకాన్ని తిరిగి అమల్లోకి తెచ్చింది. వారం క్రితం మంత్రి నిమ్మల రామానాయుడు పురుషోత్తపట్నం ఫేజ్-1వద్ద ఈ పథకాన్ని ప్రారంభించారు. గోదావరి జలాలు ఏలేరుకు చేరుకుంటుండడంతో ఈప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏలేరుకు 750 క్యూసెక్కుల నీరు

ఏలేశ్వరంలోని ఏలేరు ప్రాజెక్టుకు బుధవారం గోదావరి జలాలు ప్రవేశించాయి. ప్రాజెక్టులోకి 750 క్యూసెక్కుల నీరు చేరుతోంది. జగ్గంపేట మండలం రామవరంవద్ద పురుషోత్తపట్నం ఫేజ్-2 వద్ద నాలుగు పంపుల ద్వారా నీటిని ఏలేరుకు తరలిస్తున్నారు. గోదావరి జలాలు ఏలేరుకు చేరడంతో ప్రాజెక్టుపై ఆధారపడిన 53వేల ఎకరాలకు సాగునీరు సరఫరా చేసేందుకు వీలుంటుంది. ఇన్నాళ్లు ప్రాజెక్టులో 3 టీఎంసీల నీరు మాత్రమే ఉండేది. డెడ్ స్టోరేజ్ స్థాయికి చేరిన ఈ నీటినే పంపుల ద్వారా విశాఖకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో రైతులకు సాగుపై ఆందోళన ఏర్పడింది. ఇప్పుడు గోదావరి నీరు వస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాజెక్టు స్థితిగతులు..

ప్రస్తుతం ప్రాజెక్టులో 86.56 మీటర్ల ఎత్తున 24.11 టీఎంసీలను నిల్వచేయవచ్చు. వర్షాలు కురవకపోవడంతో నీరు చేరలేదు. దీనివల్ల వారం క్రితం వరకు ప్రాజెక్టులో 3 టీఎంసీల నీరు మాత్రమే ఉండేది. ప్రస్తుతం ఏలేరులో 71.05 మీటర్ల స్థాయిలో 5.09 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. ఖరీఫ్ సాగుకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా నీరు విడుదల చేస్తామని ఏలేరు అధికారులు తెలియజేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నారు.

శాస్త్రీయ విధానాలతో పారిశుధ్య సమస్యకు పరిష్కారం

- వ్యర్థాల నిర్వహణపై అధ్యయనం
- పిఠాపురంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ పర్యటన

పిఠాపురం, జూలై 10: శాస్త్రీయ విదానాలతో ఘన, ద్రవ్య వ్యర్థాల నిర్వహణ చేపట్టి పారిశుధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా తొలి అడుగు పడింది. ఘన, ద్రవ్య వ్యర్థాల నిర్వహణ, పారిశుధ్యం మెరుగుపరచడం తదితర అంశాలపై పిఠాపురం నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దాలన్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌లోని పురపాలక, పట్టణాభివృద్ధి అడ్వయిజర్, సాలిడ్ అండ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసన్ బుధవారం పిఠాపురంలో పర్యటించారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ ఇబ్బందిగా ఉన్న ప్రాంతాలు, రోడ్లు, డ్రెయిన్లు లేని వీధులు, పార్కులు, వార్డు సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీస్థలాలును ఆయన పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ, కార్మికులు, అధికారులు పనితీరుపై అధ్యయనం చేశారు. పర్యావరణాన్ని కాపాడుతూ ఘన, ద్రవ్య వ్యర్థాల నిర్వహణ ఎలా చేపట్టాలి అనే అంశంపై పరిశీలన జరిపారు. మెరుగైన పారిశుధ్య వ్యవస్థ కోసం ఏం చేయాలో సమగ్ర నివేదిక, డాక్యుమెంటరీ రూపొందించి పవన్‌కల్యాణ్‌కు అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట మునిసిపల్ కమిషనరు కనకారావు, టీపీవో శ్రీనివాసరావు ఉన్నారు.

రైళ్లలో పోయిన సెల్‌ఫోన్లు అప్పగింత

కార్పొరేషన్(కాకినాడ), జూలై 10: గవర్నమెంట్ రైల్వే ఔట్‌పోస్టు కాకినాడ పరిధిలోని రైళ్లలో ప్రయాణించిన వారు పోగొట్టుకున్న 12సెల్‌ఫోన్లను జీఆర్పీ ఎస్‌ఐ రవికుమార్ తిరిగి వారికి అప్పగించారు. కొందరు ప్రయాణికులు సెల్‌ఫోన్లు చోరీపై విజయవాడ ఎస్‌ఆర్పీ రాహుల్ దేవ్‌సింగ్ పర్యవేక్షణలో రాజమహేంద్రవరం డీఎస్పీ మోహనరావు, కాకినాడ లైన్స్‌ఇన్‌స్పెక్టర్ గోస్‌బ్యాగ్ ఆధ్వర్యంలో ఫిర్యాదులు ఇచ్చామని ఎస్‌ఐ తెలిపారు. సాంకేతి కపరిజ్ఞానంతో వాటిని కనిపెట్టి 12మందికి అప్పగించామన్నారు. వాటివిలువ రూ.3లక్షలకుపైగా ఉంటుందన్నారు.

ఎన్‌క్యూఏ స్టాండర్డ్స్‌పై అభినందనలు

జీజీహెచ్(కాకినాడ), జూలై 10: నేషనల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ స్టాండర్డ్స్ కేంద్రవైద్యఆరోగ్యబృందం ఆధ్వర్యంలో జిల్లాలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలు,విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో జరిగిన ఆరోగ్య కార్యక్రమాలకు ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్ పొందిన ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, సిబ్బందిని డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ అభినందించారు. బెండపూడి-విలేజ్ క్లినిక్1, జీ మామిడాడ-3 ఉత్తమ సర్టిఫికెట్ పొందడం అభినందనీయమన్నారు.

ఎన్టీఆర్‌భరోసా పెంపుదలపై హెల్ప్‌డెస్క్

జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం పెంపుదలపై హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో నరసింహనాయక్ తెలిపారు. ఈ పథకంలో అర్హత కోసం 7981604598 హెల్ప్‌డెస్క్‌కు ఫోన్ చేసి వివరాలు పొందాలని కోరారు.

కదలరు.. వదలరు..



కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం

- కార్పొరేషన్‌లో కదలని కుర్చీలు
- అడిగేవారు లేరు.. అడ్డుకునేవారు లేరు
- నిబంధనల పేరుతో సీనియర్ల హవా
- సర్వీస్ రూల్స్ లేకపోవడంతో పాతుకుపోతున్న అధికారులు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 10: కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏళ్ల తరబడి కొందరి రాజ్యం నడుస్తోంది. ఒకే కుర్చీకి అంటిపెట్టుకుని కొందరు సీనియర్లు తమ ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నారు. వీరికి తెలియకుండా ఫైళ్లు కదిలేదిలేదు. పని జరిగేది లేదు. ఇంతకీ ఇదంతా ఎలా జరుగుతుంది, నిబంధనలకు విరుద్ధంగా వీళ్ల బదిలీలు కాకుండా ఎలా ఉంటున్నారో తెలుసుకుందాం.

సర్వీస్ రూల్స్ లేకపోవడంతో..

కాకినాడ నగరపాలక సంస్థలో ప్రధానంగా ఏడు విభాగాలున్నాయి. జనరల్ సెక్షన్, రెవెన్యూ సెక్షన్, హెల్త్ సెక్షన్, టౌన్ ప్లానింగ్ విభాగం, మెప్మా, ఇంజనీరింగ్, అకౌంట్ సెక్షన్ ఉన్నాయి. ఇందులో చాలామంది సర్వీస్ లేకపోవడంతో ఒకే కుర్చీకి అంటిపెట్టుకుని చాలాసంవత్సరాలుగా ఉండిపోయారు. ఇక్కడే ఉద్యోగంలో చేరి ఇక్కడే ఉద్యోగ విరమణ పొందుతున్నారు. దీంతో సీనియార్టీ పేరుతో వ్యవస్థలన్నింటినీ తమ చెప్పుచేతల్లో పెట్టుకుని వాళ్లు చెప్పిందే వేదంలా అన్నట్లు కార్పొరేషన్‌ను ముందుకు నడిపిస్తున్నారు. దీనికి సర్వీస్ రూల్స్ లేకపోవడమే కారణం.

కార్పొరేషన్‌గా అప్ గ్రేడ్‌తో..

గతంలో కాకినాడ మున్సిపాల్టీగా ఉన్నప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేవు. అప్పట్లో ఒక మున్సిపాల్టీనుంచి ఇంకొక మున్సిపాల్టీకి సిబ్బంది బదిలీ అవుతుండేవారు. దీనివల్ల కుర్చీకి అంటిపెట్టుకుని ఉండే దుస్థితి కనిపించేది కాదు కానీ మున్సిపాల్టీ కాస్త 2005లో నగరపాలక సంస్థగా అప్‌గ్రేడ్ అయింది. కార్పొరేషన్‌గా అవతరించిన తర్వాత సర్వీస్ రూల్స్ లేకపోవడంతో ఇక్కడ కుర్చీల్లో ఉండి చాలాకాలంగా ఉద్యోగాలు చేస్తున్న వాళ్లకి అభయహస్తంగా మారింది. కార్పొరేషన్ సర్వీస్ రూల్స్ ప్రకారం ఒక స్థాయి ఉద్యోగులు తప్ప మిగిలిన ఎవరూ కూడా వేరే కార్పొరేషన్‌కి బదిలీ అయ్యే అవకాశంలేదు. దీంతో కాకినాడ కార్పొరేషన్‌లో చేస్తున్న పదుల సంఖ్యలో ఉద్యోగులు చాలాకాలంగా అదే కుర్చీకి అంటి పెట్టుకుని ఉంటున్నారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా వీరికి అనుకూల పరిస్థితులు ఉండేలా చూసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో ఎవరినైనా బదిలీ చేయాలనుకుంటే అక్కడినుంచి అక్కడికే పక్క కుర్చీకే బదిలీ చేస్తున్నారు. దీన్ని ఒక పెద్ద బదిలీగా చూపించి తమ ఇష్టారాజ్యంగా కార్పొరేషన్‌లో చాలా మంది ఉద్యోగులు సొంతంగా వ్యవస్థ నడిపిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వాళ్లు చెప్పింది చెప్పినట్లే జరగాల్సిన పరిస్థితులను వాళ్లు సృష్టిస్తున్నారన్న విమర్శలున్నాయి. కొంతమంది ఉద్యోగులు నిజాయితీగా పనిచేసినా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని చాలామంది వాళ్లు చేసే దందాలకు అడ్డూఅదుపు లేకుండా పోతున్నాయి.

పక్క వార్డులకు మాత్రమే బదిలీలు

గతంలో ఐదుగురు అధికారులు మొత్తం వ్యవస్థ నడిపించేవారు. వీరిని అందరూ పంచతంత్రంగా పిలిచేవారు. గతంలో ఆంధ్రజ్యోతిలో 'పంచతంత్రం' శీర్షికతో ఒక కథనం కూడా వెలువడింది. అందులో ఇద్దరు ఉద్యోగ విరమణ పొందడంతో వారి పరపతి కాస్త బలహీనపడింది. పంచతంత్ర తయారు చేసిన కొంతమంది ఉద్యోగులు చక్రం తిప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఎక్కడ రెవెన్యూ జనరేట్ అవుతుందో అక్కడ పైరవీలు చేయించుకుని మరీ పోస్టింగ్‌లు వేయించుకుంటారన్న ఆరోపణలు అప్పట్లోనే వచ్చాయి. శానిటరీ సర్కిళ్లలో మేస్త్రీ దగ్గరనుంచి పైస్థాయి అధికారి వరకు అంతర్గత బదిలీలు కూడా అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. బదిలీ చేయాల్సి వచ్చినా సెక్షన్ మార్చకుండా ఒకే సెక్షన్‌లో పక్కపక్క వార్డులకు మాత్రమే కదుపుతున్నారు. ఏళ్ల తరబడి కార్పొరేషన్‌లో పాతుకుపోవడంతో వారి దందాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుందని బాధితులు అనేకమంది వాపోతున్నారు. కమిషనర్ పూర్తిస్థాయిలో విచారణ చేసి అంతర్గత బదిలీలను ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు.

సీఐటీయూ ధర్నా

- కార్మికుల కోర్కెల దినం పాటిస్తూ శాంతియుత నిరసన



కాకినాడ మెయిన్‌రోడ్‌లో ధర్నా చేస్తున్న స్కీం వర్కర్లు

కాకినాడ సిటీ, జూలై 10: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సీఐటీయూ ఇచ్చిన పిలుపులో భాగంగా కార్మికుల కోర్కెల దినం పాటిస్తూ బుధవారం కాకినాడ మెయిన్‌రోడ్ హెడ్ పోస్టాఫీసు వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ధర్నాకు సీఐటీయూ కాకినాడ నగర కన్వీనర్ మలకా వెంకటరమణ ఆధ్వర్యం వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో ఎన్‌డీఏ మూడోసారి అధికారం చేపట్టినందున కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయకుండా కట్టు బానిసలుగా చేయాలని చూస్తోందని, వాటిని రద్దు చేసి 44 కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, నిత్యావసర వస్తువుల ధరలు అదుపులో ఉంచాలని కోరారు. ఏపీ ఎమ్మెస్సార్‌యు రాష్ట్ర కోశాధికారి దుంపల ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రం ప్రజలు నిత్యం ఉపయోగించే మందులపై, వైద్యపరికరాలపై జీఎస్టీని పూర్తిగా ఎత్తి వేయాలని, సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్‌ను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఆశావర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి భారతి మాట్లాడుతూ మహిళలు పనిచేస్తున్న అన్ని శాఖల్లోను లైంగిక వేధింపుల నిరోధక కమిటీలను వేయాలన్నారు. సీఐటీయూ కాకినాడ నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ కాకినాడ పోర్టులో పనిచేస్తున్న వందలాది మంది కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో వివిధ యూనియన్ల నాయకులు సి.వెంకట్రావు, శేషు, ఏడుకొండలు, నీరజ, జ్యోతి పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ పునరుద్ధరణకు చర్యలు: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 10: కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ద్వారా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్‌రూమ్ పునరుద్ధరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో కేఎస్‌సీసీఎల్ 43వ డైరెక్టర్ల బోర్డు సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ కాకినాడ పట్టణాన్ని ఆకర్షణీయ నగరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. కాకినాడ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌కు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.192.42కోట్లు రావాల్సి ఉందన్నారు. కేఎస్‌సీసీఎల్ ప్రాజెక్టు కింద వివేకానంద పార్కువద్ద ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ పునరుద్ధరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా 40టీపీడీ కెపాసిటీ బయో-మెథనేషన్ ప్లాంట్ నిర్మాణం, సరఫరా, ఇన్‌స్టాలేషన్ స్థలాన్ని చొల్లంగి నుంచి దుమ్ములపేటకు మార్చడం వంటి అంశాలపై పూర్తినివేదిక సమర్పించాలన్నారు. కాకినాడ నగరపాలకసంస్థ కమిషనర్, కేఎస్‌సీసీఎల్ సీఈవో, ఎండీ వెంకటరావుతో కలిసి స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు పనులపై సమీక్షించారు. సమావేశంలో ఏడీసీ నాగనరసింహారావు, ఎస్‌ఈ వెంకటరావు, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ జేవీఆర్ మూర్తి, కేఎస్‌సీసీఎల్ డైరెక్టర్, కృష్ణకుమార్, ప్రసన్న కుమార్, ఆనందరావు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల రుణాల వివరాలు సమర్పించాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 10: టిడ్కో గృహాల లబ్ధిదారులకు బ్యాంకులవారీగా మంజూరు చేసిన రుణాలు, రికవరీలకు సంబంధించిన వివరాలు సమర్పించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో టిడ్కో గృహాల పురోగతిపై టిడ్కో, మెప్మాఅధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 7,288 టిడ్కో గృహాలకుగాను 6384 గృహాలు నిర్మాణపనులు పూర్తి చేసి ప్రారంభించారన్నారు. ఇందులో 3386 గృహాలు రిజిస్ట్రేషన్, తనఖా ప్రక్రియను పూర్తి చేసి ఆయా మున్సిపాలిటీ లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. మిగిలిన వివిధ దశల్లో టిడ్కో గృహాల లబ్ధిదారులకు బ్యాంకులవారీగా మంజూరు చేసిన రుణాల రికవరీలకు సంబంధించిన వివరాలు సేకరించి నివేదిక సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో టిడ్కో సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు. ఈఈ రీటా, మెప్మా పీడీ ప్రియంవద పాల్గొన్నారు.

కర్మాగారాల్లో అధికారుల తనిఖీలు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 10: జిల్లాలో కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాల మేరకు ప్రమాదకర కర్మాగారాలను తనిఖీ చేశామని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాకలపూడి ఏరియాలోని మహతిస్టోరేజ్ టెర్మినల్, పోర్టురోడ్డులోని ఐఎంసీ లిమిటెడ్‌ల్లో ప్రమాదకర కర్మాగారాలను తనిఖీ చేసి పలుసూచనలు ఇచ్చామన్నారు. తనిఖీలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు రైతులు, శాస్త్రవేత్తల కృషి అభినందనీయం

13 మంది పొగాకు రైతులకు టీఐఐ అవార్డులు
సత్కరించిన ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి
దేవరపల్లిలో టుబాకో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా పురస్కారోత్సవం

దేవరపల్లి, జూలై 10: 'ప్రపంచంలోనే నాణ్యమైన పొగాకు ఉత్పత్తులకు మనదేశం పెట్టిందిపేరు. అందులోనూ అత్యధిక స్థాయిలో పొగాకు పండించేది కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేనని' రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం కరుటూరి ఫంక్షన్ హాలులో టుబాకో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (టీఐఐ) 24వ అవార్డు కార్యక్రమంలో ఆమె పాల్గొని పొగాకు శాస్త్రవేత్తలు, రైతులను అవార్డులతో సత్కరించారు. రాష్ట్రస్థాయిలో మొత్తం 16 మంది అవార్డులకు ఎంపిక కాగా, ఇందులో 13 మంది రైతులకు, ముగ్గురు శాస్త్రవేత్తలకు పురస్కారాలను అందించారు. పొగాకు సాగులో ఆధునిక సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించడం, పొగాకు పంట పరిశోధన, అభివృద్ధిలో నిమగ్నమైన అభ్యుదయ రైతుల వ్యవసాయ క్షేత్రాలను ఎంపిక చేసి వారికి ఈ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన అవార్డు ప్రదానోత్సవ సభలో పురందేశ్వరి మాట్లాడుతూ పొగాకు సాగులో రైతులతో పాటు శాస్త్రవేత్తల కృషి అభినందనీయమని, వారికి అవార్డులు అందించడం హర్షణీయమని చెప్పారు. ఈ ఏడాది అకాల వర్షాలకు పొగాకు పంట దెబ్బతిందన్నారు. రైతుల కోరిక మేరకు పరిమితికి మించి జరిగిన పొగాకు అమ్మకాలపై పెనాల్టీని రద్దు చేయాలని వాణిజ్యశాఖ మంత్రి పియూష్‌గోయల్‌తో మాట్లాడామని త్వరలోనే నిర్ణయం వస్తుందన్నారు. పొగాకు ఉత్పత్తిలో కూలీల ఖర్చు పెరిగిపోయిందని, దానికి ఆకురెల్చు యంత్రాలు, ఆకు కుట్టే యంత్రాలను తయారు చేయాలని, కలప కూడా దొరికే పరిస్థితి లేనందున బేరన్‌లో పొగాకు క్యూరింగ్ చేయడానికి గ్యాస్ ద్వారా సోలార్ ఎనర్జీని అభివృద్ధి చేయడానికి సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందని, పొగాకుకు, పామాయిల్ పంటకు సంబంధించి రైతుల తరపున తాము సమస్యల పరిష్కారానికి ముందుంటామన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ భూసారాన్ని పరిరక్షించుకోవడానికి రైతులు విపరీతంగా రసాయనిక ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా పొగాకు ఉత్పత్తి చేయాలన్నారు. పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ పొగాకు పంట ద్వారా రూ.12 వేల కోట్ల విదేశీ మారకద్రవ్యం లభిస్తోందని, ఈ పొగాకు పంటపై 4 వేల కోట్ల మంది ఆధారపడుతున్నారన్నారు. పొగాకు రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని, పొగాకు పంట పరిమితి మేరకే పండించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, పొగాకు బోర్డు వైస్ చైర్మన్ వాసుబాబు, టుబాకో బోర్డు కార్యదర్శి డి.వేణుగోపాల్, సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్, పొగాకు రైతు సంఘం నాయకులు, అవార్డు గ్రహీతలు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, వివిధ పొగాకు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.


అవార్డుతో సత్కరిస్తున్న ప్రముఖులు

పొగాకు రైతు పురస్కార గ్రహీతలు వీరే :

సయ్యద్‌బాజీ(కొయ్యలగూడెం బోర్డు, అచ్చియ్యపాలెం), గురుబ్రహ్మం (కనిగిరి బోర్డు, భూతవారిపల్లి), టి.వెంకటశేషమ్మ (ఒంగోలు బోర్డు, చేకూరుపాడు) ఎ.శ్రీనివాస్‌రెడ్డి (వినుకొండ బోర్డు, యోగిరెడ్డిపాలెం) జి.సంజీవ్‌రెడ్డి (వినుకొండ బోర్డు, రెడ్డినగర్), కె.వెంకటసత్యనారాయణ (జంగారెడ్డిగూడెం-1 బోర్డు, పెద్దాపురం), ఎస్.ఎం.రెడ్డి (కందుకూరు-2 బోర్డు ఓలేటివారిపాలెం), కె.అంజిరెడ్డి (వెల్లంపల్లి బోర్డు, జి.నిడమర్రు), సుజాత (కొత్తదొడ్డి బోర్డు, రాయ్‌చూర్), సత్తి జగదీశ్వర్‌రెడ్డి (దేవరపల్లి బోర్డు, కృష్ణంపాలెం) జి.వి.రమణారెడ్డి, (కందుకూర్-1 బోర్డు, సింగరబొట్లపాలెం)

అవార్డులు అందుకున్న శాస్త్రవేత్తలు

డాక్టర్ వై.సుబ్బయ్య, డాక్టర్ పూర్ణబిందు, డాక్టర్ సీ.నంద

లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డులు

గద్దే బాబురాజేంద్రప్రసాద్ (జంగారెడ్డిగూడెం-2, రెడ్డి గణపవరం), జి.నరసపనాయుడు (డీసీ.పల్లి, గుండెమడకల గ్రామం)


ఎంపీ హరీష్‌మాధుర్‌ను కలిసిన కోనసీమ జేఏసీ ప్రతినిధులు

ఐదేళ్ల లోపు కోనసీమ రైల్వే ప్రాజెక్టు పూర్తి
ఎంపీ హరీష్‌మాధుర్

అమలాపురం టౌన్, జూలై 10: లోక్‌సభ దివంగత స్పీకర్, తన తండ్రి జీఎంసీ బాలయోగి ఆశయ సాధనలో భాగంగా కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ పూర్తి చేయడమే తన లక్ష్యమని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. బుధవారం ఆయనను క్యాంపు కార్యాలయంలో కోనసీమ జేఏసీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు. కోనసీమ రైల్వేలైన్ గురించి చర్చించగా.. ఎంపీ స్పందిస్తూ ఐదేళ్లలోపు కోనసీమ రైల్వే ప్రాజెక్టు పూర్తిచేసే దిశగా ముందుకు సాగుతున్నట్టు వివరించారు. భూసేకరణలో జాప్యం కారణంగానే పనులు ముందుకు సాగట్లేదని జేఏసీ సభ్యులు ఎంపీ దృష్టికితీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ బండారు రామ్మోహనరావు, సహ కన్వీనర్లు యిళ్ల భక్తవత్సలం, కరాటం ప్రవీణ్, మంత్రిప్రగడ వేణుగోపాల్, సభ్యులు డాక్టర్ మధుర నరసింహమూర్తి, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, అన్యం రాంబాబు, రంకిరెడ్డి కాశీ, సీలి సంసోను, నంద్యాల నాయుడు, పమ్మి నాగేశ్వరరావు, టి.సుందరరామయ్య పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి కానిస్టేబుల్ మృతి


మృతిచెందిన చాంద్‌బాషా



మోతుగూడెం, జూలై10: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో తులసిపాక మారేడుమిల్లి ఘాట్ రోడ్‌లో బైక్ అదుపుతప్పి లోయలో పడడంతో మంగళవారం అర్ధరాత్రి రాజమహేంద్రవరానికి ఎస్ఈబీ కానిస్టేబుల్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. చింతూరు ఎస్ఈబీ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ చాంద్‌బాషా (54) చింతూరు నుంచి రాజమండ్రి ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. తులసిపాక సోకిలేరు వ్యూ పాయింట్ వద్ద బైక్ అదుపు తప్పి లోయలో బోల్తా పడింది. ఈ ఘటనలో చాంద్ బాషా అక్కడికక్కడే మృతి చెందినట్లు మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు తెలిపారు.

విద్యుదాఘాతంతో కడియపులంక వాసి మృతి



కడియం, జూలై 10: మహబూబ్‌నగర్ జిల్లా నవపేట మండలం ఇప్పటూర్‌లో విద్యుత్‌షాక్‌కు గురైన సంఘటనలో కడియం మండలం కడియపులంకకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తిరుమాళ్ళకు చెందిన గోళ్ల నూకార్జున(36)కు ఓ వ్యాను ఉంది. ఓనర్ కం డ్రైవర్‌గా ఉన్నాడు. జీవనం కోసం కొన్నేళ్ల క్రితం కడియపులంక వచ్చి జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మామిడి మొక్కలను వేసుకుని నూకార్జున మహబూబ్‌నగర్ జిల్లా వెళ్లాడు. ఇప్పటూర్‌లో బుధవారం వ్యాన్‌లో వెళుతుండగా విద్యుత్ తీగలు వ్యాన్‌కు తగలడంతో వ్యాన్‌కు విద్యుత్ సరఫరా అయ్యి మృతి చెందాడు. నూకార్జునకు భార్య సాయిదుర్గ, 9 ఏళ్ల కుమార్తె అశ్విని, 3 ఏళ్ల కుమారుడు రాజేష్ ఉన్నారు.

నేటి నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు

పోర్టుసిటీ(కాకినాడ), జూలై 10: అల్లూరి సీతారామరాజు నాటక పరిషత్ ఆధ్వర్యంలో 40వ వార్షికోత్సవం పురస్కరించుకుని 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వానపు నాటిక పోటీలు నిర్వహిస్తున్నామని సంస్థ ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు తెలిపారు. కాకినాడ సినిమారోడ్‌లోని సూర్యకళామందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు నాటిక పోటీలు జరుగుతాయన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు తెలుగు వీర లేవరా-దీక్షబూని సాగరా పేరుతో సినీ సంగీత స్వరాభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభ సభ జరుగుతుందన్నారు. సభలో ముఖ్య అతిథిగా కాకినాడ నగర శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), విశిష్ట అతిథిగా ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పాల్గొంటారని తెలిపారు. రాత్రి 7 గంటలకు మలి సంధ్య, అనంతరం ఆ సరసాల నాటిక ప్రదర్శనలు జరుగుతాయన్నారు. 13వ తేదీన ఆంధ్రశ్రీ అవార్డును ప్రముఖ పారిశ్రామికవేత్త సలాది వీర వెంకట సత్యనారాయణమూర్తికి, 14న అల్లూరి సీతారామరాజు విశిష్ట సాంస్కృతిక సేవా పురస్కారాన్ని శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకులు గుంటూరి తణుకులు(శ్యామ్)కు అందజేస్తామని వివరించారు. అనంతరం నాటిక పోటీల ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. పరిషత్ ఉపాధ్యక్షులు బాపిరాజు, కిర్ల పుల్లారావు పాల్గొన్నారు.


అభినందనలు తెలియజేస్తున్న ఏపీ ఎన్జీవో నాయకులు

గోదావరి డెల్టా సిస్టం సీఈగా
బాధ్యతల స్వీకరణ

ధవళేశ్వరం, జూలై 10: గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజనీర్‌గా క్వాలిటీ చీఫ్ ఇంజనీర్ పుల్లారావు బుధవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఆయనను ఏపీ ఎన్జీవో సంఘ నాయకులు కార్యాలయంలో కలిసి అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్.జయకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు పి.రాజబాబు, బి.లక్ష్మణుడు, పీఎస్ శేషకుమార్, కుమారస్వామి, వాసుదేవి తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చాలని కలెక్టర్‌కు ఎమ్మెల్సీ లేఖ

రంగంపేట, జూలై 10: ఏడీబీ రోడ్డు గుంతలు తక్షణమే పూడ్చాలని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతికు వినతిపత్రం ఇచ్చారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకర్లకు వివరాలు వెల్లడించారు. రాజానగరం నుంచి సామర్లకోట వరకు నిర్మిస్తున్న ఏడీబీ రోడ్డు నిర్మాణ పనులు మధ్యలోనే అర్థాంతరంగా ఆగిపోవడంతో దారుణంగా పాడైపోయిందని, రాజానగరం సెంటర్ నుంచి రామస్వామిపేట వరకు గల ఏడీబీ రోడ్డు అత్యంత ప్రమాదకరంగా ఉందని, ఈ రోడ్డు మీద రోజూ వేలాది వాహనాలు కాకినాడకు నిత్యం ప్రయాణం చేస్తుంటాయని ఈ గుంతల రోడ్డు కారణంగా ఈ మధ్య కాలంలో వందలాది మంది ప్రమాదాలకు గురయ్యారని లేఖలో పేర్కొన్నట్లు చెప్పారు. ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీకాంత్‌ను కలిసి ఈ రోడ్డు గుంతలు తక్షణమే పూడ్చాలని కోరినట్టు లేఖలో పేర్కొనగా వారు సానుకూలంగా స్పందించారని ఐవీ తెలిపారు.

అత్యాచార ఘటనపై ఏఎస్పీ విచారణ

ఎటపాక, జూలై 10: మండలంలోని ఓ గ్రామంలో నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచార ఘటనలో బుధవారం ఏఎస్పీ రాహుల్ మీనా క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. ఘటనపై బాధిత తల్లిదండ్రులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అత్యాచార ఘటన జరిగిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం చుట్టుపక్కల వారిని ప్రశ్నించారు. నిందితుడిని కఠినంగా శిక్షించేలా చేస్తామని చెప్పారు. అయితే వైద్య పరీక్షలు నిమిత్తం బాధిత చిన్నారిని చింతూరుకు తరలించారు. ఏఎస్పీ వెంట సీఐ డి.రామారావు, ఐసీడీఎస్ సీడీపీవో విజయగౌరి, ఎస్ఐ పార్థసారథి, వీఆర్వో కన్నమ్మ ఉన్నారు.

డయేరియాతో చికిత్స పొందుతూ మృతి

సీతానగరం, జూలై 10: డయేరియా సోకిన వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. సీతానగరం గ్రామానికి చెందిన బేదంపూడి జగన్నాథం(61) ఈ నెల 2న డయేరియాతో సీతానగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. దీంతో వాంతులు, విరేచనాలు తగ్గాయి. అనంతరం ఈ నెల 5న రాజమహేంద్రవరంలోని కిడ్నీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి గంగా హాస్పటల్‌లో చేర్చగా అక్కడ డయాలసిస్ చేశారు. అక్కడ నుంచి ఈ నెల 9న కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించాడు. జగన్నాథంకు డయాలసిస్ చేస్తున్నారని కాకినాడ నుంచి రెండు రోజులలో వచ్చే రిపోర్టును పరిశీలించి మరణానికి గల కారణాలను నిర్ధారిస్తామని పీహెచ్‌సీ వైద్యులు డా. చైతన్య తెలిపారు.

800 కిలోల గంజాయి పట్టివేత

చింతూరు, జులై 10 : మోతుగూడెం పోలీసులు రూ. 40 లక్షల విలువైన 800 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం విలేకరుల సమావేశంలో చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా వివరాలు వెల్లడించారు. రెండు వేర్వేరు ఘటనలలో మొత్తం 800 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు ఏఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన అమిత్‌గిరి, శివదయాల్, అలోక్ గోతం, రంజిత్‌మాపై, దుర్గేశ్‌గోస్వామి ఒక ముఠాగా ఏర్పడ్డారు. అనంతరం ఈ ఐదుగురు ఒడిసా రాష్ట్రం, మల్కానగిరి జిల్లా అల్లూరికోటకు చెందిన సంజీవ్ అలియాస్ గెన్ను వద్ద 550 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. అనంతరం గంజాయిని అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం పోలీసు స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతానికి తరలించారు. అక్కడ నుంచి మధ్యప్రదేశ్‌కు తరలించే క్రమంలో ఐచర్ వ్యాన్‌లో లోడ్ చేశారు. సమాచారం అందుకున్న మోతుగూడెం పోలీసులు కాపు కాచి ఐచర్ వ్యాన్‌తో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాగా మధ్యప్రదేశ్‌కు చెందిన రంజిత్‌మాపై, దుర్గేశ్‌గోస్వామిలతో పాటు ఒడిసాకు చెందిన సంజీవ్ పరారీలో ఉన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, సుక్మా జిల్లా, కుంటకు చెందిన మజ్జి వెంకట్ సమంత్, తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకకు చెందిన సతీష్‌రెడ్డి, వరంగల్ జిల్లా జనగాంకు చెందిన యరవ వివేక్ డొంకరాయి పోలీసు స్టేషను పరిధిలోని మంగంపాడు నుంచి హైదరాబాద్‌కు కారులో 250 కిలోల గంజాయి తరలించే ప్రయత్నం చేశారు. మోతుగూడెం పోలీసులు కాపు కాచి కారుతో పాటు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కాగా ఈ ఘటనలో సతీష్‌రెడ్డి, యరవ వివేక్ పరారీలో ఉన్నట్లు ఏఎస్పీ తెలిపారు. గంజాయి స్మగ్లింగ్ విషయంలో పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. తెలిసో తెలియకో వాహనాలను అద్దెకు ఇవ్వడం కూడా నేరమేనని ఏఎస్పీ చెప్పారు. వాహనాలను అద్దెకు ఇచ్చే సమయంలో సంబంధిత వాహన యజమానులు విధిగా పూర్తి వివరాలు తీసుకొని అద్దెకు ఇవ్వాలని ఏఎస్పీ సూచించారు. చింతూరు డివిజన్ పరిధిలో పోలీసు చెక్‌పోస్టులు పకడ్బందీగా ఏర్పాటు చేశారని, ఇకపై గంజాయి తరలింపు అనేది ఈ దిశగా అసాధ్యమని ఏఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో చింతూరు సీఐ గజేంద్రకుమార్, మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు సిబ్బంది పాల్గొన్నారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాహుల్‌మీనా

ఇంకా లభ్యం కాని గల్లంతైన వృద్ధుడి ఆచూకీ


ఆర్ఆర్‌బీ చెరువు వద్ద పరిస్థితి సమీక్షిస్తున్న ఆర్డీవో, సీఐ

గొల్లప్రోలు రూరల్, జూలై 10: గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరం గ్రామానికి చెందిన వృద్ధుడు తటవర్తి వేమన్నదొర ఆచూకీ బుధవారం రాత్రి వరకూ లభ్యం కాలేదు. వేమన్నదొర పశువులు మేపేందుకు 7వ తేదీ సాయంత్రం మల్లవరంలోని ఆర్ఆర్‌బీ చెరువు వద్దకు వెళ్లి తిరిగి రాకపోవడంతో చెరువులో పడి గల్లంతై ఉండవచ్చునని పోలీసులకు ఫిర్యాదు అందింది. దీనిపై పోలీసులు పరిశీలన జరిపారు. బుధవారం పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది, నలుగురు గజ ఈతగాళ్లు చెరువులోకి దిగి గాలించినప్పటికి ఫలితం లేకపోయింది. గాలింపు చర్యలను తహసీల్దారు ఉదయభాస్కర్, పోలీసు అధికారులు పర్యవేక్షించారు. చెరువు మొత్తంలో నీరు లేదని, మూడు మీటర్ల వెడల్పు గల కాలువలో మాత్రమే నీరు ఉన్నట్లు గుర్తించారు. హెలికాప్టర్ ద్వారా గాలిస్తే ఫలితం ఉండవచ్చునని గ్రామ ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. ఈ నేపథ్యంలో కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మరోవైపు గాలింపు చర్యలు కోసం హెలికాప్టర్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాన్ని పంపాలని జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్ ప్రభుత్వాన్ని కోరుతూ లేఖ రాసారు. కలెక్టర్ సూచనల మేరకు బుధవారం సాయంత్రం ఎస్‌డీఆర్ఎఫ్ బృందం రంగంలోకి దిగినా వృద్ధుడి ఆచూకీ కనుక్కోలేకపోయినట్టు స్థానికులు తెలిపారు. గురువారం గాలింపు చర్యలు కొనసాగనున్నాయి.

'రాజకీయ కక్షకు బలైన శ్రీనుకు విముక్తి కల్పించాలి'

ముమ్మిడివరం, జూలై 10: రాజకీయ కక్షకు బలైన జనిపల్లి శ్రీనివాసరావు (కోడికత్తి శ్రీను)కు కేసుల నుంచి విముక్తి కల్పించాలని విదసం (విశాఖ జిల్లాల దళిత సంఘాల ఐక్య వేదిక) విజ్ఞప్తి చేసింది. బుధవారం జనపల్లి శ్రీనివాసరావు, అతని సోదరుడు సుబ్బరాజు, విదసం నాయకులతో కలిసి విదసం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట్రావు మురముళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు)కు ఈ మేరకు విన్నవించారు. ఎన్ఐఏ చట్టం 2008 సెక్షన్ 7-బి ప్రకారం కేసు దర్యాప్తు ప్రాసిక్యూషన్ నుంచి ఎన్ఐఏ వైదొలగాలని, రాష్ట్ర ప్రభుత్వం కేసును సమీక్షించి న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈవీఎం పగులగొట్టి పోలింగ్ ఏజెంటును, పోలీసు అధికారిని కొట్టి రిమాండ్‌లో ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని జైలుకు వెళ్లి పలకరించిన జగన్మోహనరెడ్డి కోడి కత్తి కేసులో కనీసం కోర్టుకు రాకుండా కేసును సాగదీసేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు స్పందించి... కోడికత్తి శ్రీనును త్వరలోనే ప్రభుత్వ పెద్దల వద్దకు తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. విదసం నేతలు జాజి ఓంకార్, మూర మహేష్, బూల భాస్కరరావు, బల్ల కుమార్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను కలిసిన శ్రీను, విదసం సభ్యులు

సీలేరు కాంప్లెక్స్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా
బాధ్యతల స్వీకరణ



మోతుగూడెం, జూలై10: సీలేరు కాంప్లెక్స్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ద్రోణం రాజు చిన కామేశ్వరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో రాయలసీమ థర్మల్ పవర్ స్టేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేశారు. ప్రమోషన్ మీద సీలేరు కాంప్లెక్స్ లోయర్ సీలేరులో సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భీమవరపు బాలకృష్ణ, డీఈటీ వరప్రసాద్, సీనియర్ అకౌంట్ ఆఫీసర్ అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ సూర్యమోహన్‌రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం చీఫ్ ఇంజనీర్ కార్యాలయ సిబ్బంది పి.ఆనంద్‌బాబు, వేమగిరి కిరణ్ రామారావు, కామేష్, ఏపీ జెన్కో లోయర్ సీలేరు ఉద్యోగస్తులు ఇంజనీర్స్ కాంట్రాక్ట్ కార్మికులు అభినందనలు తెలిపారు.

దంగేరులో మహా ప్రస్థానం సిద్ధం



కె.గంగవరం, జూలై 10: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం దంగేరు గ్రామంలో మహాప్రస్థానం సిద్ధమైంది. వర్షాకాలంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు నిర్వహించడానికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. దీంతో గ్రామానికి చెందిన రావిపాటి వంశీయుల వితరణ రూ.50లక్షలతో మహాప్రస్థానాన్ని సిద్ధం చేశారు. కైలాస రథాన్ని ఏర్పాటు చేశారు. ఇకపై అంత్యక్రియలు నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ రావి పాటి వెంకటగణేష్‌చౌదరి, సొసైటీ మాజీ అధ్యక్షుడు రావిపాటి రవీంద్రనాథ్‌చౌదరి, రావిపాటి రవి, పోలిశెట్టి సతీష్, ఉప్పులూరి సత్యనారాయణ, రావిపాటి వెంకట సుబ్బరాయ చౌదరి, దంగేటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నియామక ఉత్తర్వులు

రంపచోడవరం, జూలై 10: అంగన్వాడీ కేంద్రాలలో ఇటీవల ఉద్యోగాలు పొందిన వారికి రంపచోడవరం ఐసీడీఎస్ కేంద్రంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి బుధవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. అంగన్వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న పోస్టులను అధికారులు ఇటీవల భర్తీ చేశారు. రంపచోడవరం ఐసీడీఎస్ పరిధిలోని ఆరుగురికి నియామక ఉత్తర్వులను ఎమ్మెల్యే అందజేశారు. అంగన్వాడీ కార్యకర్తలుగా తల్లీబిడ్డల సంరక్షణ ఎంతో పవిత్రంగా నిర్వహించాలని కోరారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు ఉదయభాస్కర్, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

మన్యంలో ఆర్గానిక్ పత్తి పండించే ప్రాజెక్టు


పీవోను కలిసిన నెదర్లాండ్స్ ప్రతినిధులు

రంపచోడవరం, జూలై10: మన్యంలో 4 వేల ఎకరాల్లో ఆర్గానిక్ పత్తిని పండించే ప్రాజెక్టును నెదర్లాండ్స్‌కు చెందిన రెడీస్ స్వచ్ఛంద సంస్థ చేపడుతోందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో నెదర్లాండ్స్ ప్రతినిధులతో జరిగిన సమావేశ వివరాలను ప్రాజెక్టు అధికారి వెల్లడించారు. గ్రామీణ వికాస కేంద్రం ద్వారా 4 వేల ఎకరాలలో ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నామని ఆయనకు బృందం వివరించింది. స్వీట్ ఆరెంజ్ మొక్కలు, పత్తి జిన్నింగ్ కోసం మిషనరీ ఏర్పాటు, పసుపు, జీడిపప్పు మార్కెటింగ్ కోసం కూడా నెదర్లాండ్ సహాయంతో ప్రణాళికలను సిద్ధం చేయడానికి చర్చించామని అన్నారు.

మంచినీళ్ల కోసం ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్థులు

కూనవరం, జూలై10: మండలంలోని మర్రిగూడెంలో గ్రామస్థులు మంచి నీళ్ల కోసం ధర్నా నిర్వహించారు. ఆ గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు ఊరులో ఉన్న బావి నీటిని కేవలం తన సొంత ఇంటికే ప్రభుత్వ మోటారు ద్వారా సరఫరా చేసుకుంటున్నాడని గ్రామస్తులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. దీంతో ఎస్ఐ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి వెళ్లి వైసీపీ నాయకుల దగ్గర ఉన్న మోటారును తిరిగి గ్రామ పంచాయతీకి అప్పగించారు. దీంతో గ్రామస్థులు ధర్నా విరమించారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

ఏలేశ్వరం, జూలై 10: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏలేశ్వరం డిపో మేనేజర్ జీవి.సత్యనారాయణ తెలిపారు. ప్రయాణికులు తమ సూచనలు, సలహాలు తెలియజేయడానికి 9959225532కు ఫోన్ చేయవచ్చని సూచించారు. ప్రయాణానికి ఆర్టీసీ బస్సులే ఉత్తమమని ఆయన చెప్పారు.

మాట నిలబెట్టుకోవడం చంద్రబాబుకే సాధ్యం : వర్మ

పిఠాపురం, జూలై 10: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు, చెప్పిన మాటలను నిలబెట్టుకోవడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకే సాధ్యమని, అధికారంలోకి వచ్చిన నెలలోపే తీసుకుంటున్న చర్యలు ఆయన పనితీరుకు నిదర్శనంగా నిలుస్తున్నాయని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టాలను గమనించిన చంద్రబాబు ఎన్నికల ముందు ప్రజలకు ఉచిత ఇసుక అందజేస్తామని ప్రకటించి ఉచిత ఇసుకను ప్రజలకు అందజేయడం ప్రారంభించారని తెలిపారు. పింఛన్లను పెంచి జూలై నెలలో రూ.7వేలు అందించామన్నారు. వైసీపీ పాలనలో చేసిన పనులకు, బిల్లు చెల్లింపులకు ఎటువంటి లెక్కలు లేవని, ఆర్థిక పరిస్థితి అంతా అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. దీనిని సరిదిద్దే ప్రక్రియలో చంద్రబాబు ఉన్నారని, అదే సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నారని తెలిపారు. సమావేశంలో టీడీపీ నేతలు నకుమళ్ల గంగాధర్, కొరుప్రోలు శ్రీను, గుండ్ర సుబ్బారావు, అల్లవరపు నగేష్, అడ్డగర్ల శివ, శీరం మాణిక్యం, బస్సా సత్యనారాయణ, కడారి బాబ్జి, పర్వత కొండయ్య, వెన్నా బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన చంద్రబాబు'

తుని రూరల్, జూలై 10: ఇచ్చిన హామీ నిలబెట్టుకుని భవన నిర్మాణ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబుకే టీడీపీ యువ నేత యనమల రాజేష్ స్పష్టం చేశారు. తేటగుంట భవన నిర్మాణ కార్మికులు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉచిత ఇసుక విధానం అమలుపై చంద్రబాబుకు తుని ఎమ్మెల్యే యనమల దివ్య, భవన నిర్మాణ కార్మికుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో సుర్ల లోవ రాజు, చింతమడి నాగ సోమరాజు, మోతుకూరి వెంకటేష్, గాడి రాజబాబు, కుసుమంచి సత్యనారాయణ, జక్కాన రామునాయుడు, గజ్జి అప్పలరాజు ఉన్నారు.

'రహదారి భద్రతా నియమాలు పాటించాలి'

పిఠాపురం, జూలై 10: ప్రమాదాల నివారణకు గానూ రహదారి భద్రతా నియమాలను ప్రతి ఒక్కరు పాటించాలని 12వ అదనపు జిల్లా జడ్జి ఏ.వాసంతి సూచించారు. మోటార్‌వెహికల్ యాక్టుపై పిఠాపురం కోర్టుల ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ మోటార్‌సైకిళ్లపై ప్రయాణించే వారు హెల్మెట్, కారుల్లో ఉన్నవారు సీటుబెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. కారులో ఎయిర్‌బాగ్స్ ఉంటే ప్రమాదాలు నివారించడం సాధ్యమవుతుందని చెప్పారు. మద్యం తాగిన వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సదస్సులో సబ్ జడ్జి ఎం.బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి విజయరామేశ్వరి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజారావు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులున్నారు.

కాల్వలకు నీరు విడుదల చేసిన ఎమ్మెల్యే

కిర్లంపూడి, జూలై 10: మండలంలోని సోమవరం గ్రామంలో ఎత్తిపోతల పథకాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ బుధవారం ప్రారంభించారు. పంపుహౌస్ రిబ్బన్ కట్ చేసి స్విచ్ ఆన్ చేసి కాల్వలకు నీరు విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సోమవరం పంపుహౌస్ పునరుద్ధరించి రైతులకు నీరందించామని, ఏలేరు నీటిని పంపుల ద్వారా లిఫ్ట్ చేసి 1200 ఎకరాలకు సోమవరం లిఫ్ట్ ద్వారా 22క్యూసెక్కులు సోమవరం, ఇర్రిపాక, బూరుగుపూడి, కృష్ణవరం గ్రామాల రైతులకు సాగునీరందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కోర్పు లచ్చయ్యదొర, చదరం చంటిబాబు, జంపన సీతారామచంద్రవర్మ, కొత్త కొండబాబు, నీటి సంఘం అధ్యక్షుడు జ్యోతుల పద్మనాభం (బాబు), ఉపసర్పంచ్ సూతి శ్రీను, మంచికంటి శ్రీను, జంపన రవివర్మ, పాల్గొన్నారు.

పుష్కర కాలువ పనులకు మోక్షం

తుని రూరల్, జూలై 10: పుష్కర కాలువ పనులకు కూటమి ప్రభుత్వంతో మోక్షం లభించింది. ప్రభుత్వ చొరవతో ఇరిగేషన్‌శాఖాధికారులు కాలువలో పూడిక తీత పనులు ప్రారంభించారు. తిమ్మాపురం సమీపంలో టీడీపీ, జనసేన నాయకులు హాజరై పనులు ప్రారంభించారు. టీడీపీ నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు, మోతుకూరి వెంకటేష్ పాల్గొన్నారు. పుష్కర ఏఈఈ రఘుకుమార్ మాట్లాడుతూ పుష్కర జలాలు ఇప్పటికే 96 కిలోమీటర్ల మేర రావడం జరిగిందని, అన్నవరం పంపా గేట్ల వద్దకు చేరుకున్న పుష్కర జలాలు 24గంటల్లో నియోజకవర్గంలో 13కిలోమీటర్ల మేర సాగునీరు ప్రవహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ పుష్కర జలాలను నియోజకవర్గంలో 35 సాగునీటి చెరువులకు నింపి రైతులకు నీటి ఇక్కట్లు లేకుండా చర్యలు చేపడుతున్నట్టు ఆయన చెప్పారు.

'తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి'

గొల్లప్రోలు, జూలై 10: పట్టణంలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని జనసేన నేతలు డిమాండ్ చేశారు. గొల్లప్రోలులోని మార్కెట్‌లో గల వాటర్‌వర్క్స్‌ను పరిశీలించేందుకు వచ్చిన పబ్లిక్‌హెల్త్ ఇంజనీరింగ్ విభాగం ఈఈ హస్సేన్‌ను వారు బుధవారం కలిశారు. పట్టణంలో ప్రతి రోజూ కుళాయిలు ద్వారా తాగునీరు అందించాలని, నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈఈని కలిసిన వారిలో బస్సా చిట్టిబాబు, మామిడాల సూరిబాబు, బలిరెడ్డి గంగబాబు, పర్ల రాజా, గరగ తాతాజీ, తలారి శ్రీనివాస్, స్వచ్ఛ గొల్లప్రోలు కన్వీనర్ కొశిరెడ్డి రాజా ఉన్నారు.

రామవరం - రాజుపాలెం రోడ్డు పరిశీలన

జగ్గంపేట/కిర్లంపూడి,జూలై 10: జగ్గంపేట మండలం రామవరం నుంచి కిర్లంపూడి మండలం రాజుపాలెం వెళ్లే రోడ్డు పరిస్థితిని బుధవారం జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, సర్పంచ్ తుమ్మలపల్లి రమేష్ పరిశీలించారు. రోడ్డు గుంతలుగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు పనులు ప్రారంభ మయ్యే లోపు కనీస మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బీ డీఈతో ఫోన్‌లో మాట్లాడి కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. దీనిపై ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ దృష్టికి తీసుకెళ్తానని రమేష్ తెలిపారు.

మహిళలకు చీరల పంపిణీ

కాకినాడ సిటీ, జూలై 10: సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు నాయకత్వంలో నగరం అభివృద్ధి పథంలో పయనించాలని సంజయ్‌నగర్ పిడుగులమ్మ తల్లి గుడిలో ఎమ్మెల్యే కొండబాబు కుమారుడు వనమాడి మోహనవర్మ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. 13వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొమ్మి బాలాజీ అమ్మవారికి దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బాసి రమణారెడ్డి, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు యలమంచిలి శ్రీను యాదవ్, పలివెల బాబ్జి, సరగడ రమణారెడ్డి, జొన్న వెంకన్న పాల్గొన్నారు.

'త్వరితగతిన నష్టపరిహారం ఇప్పించాలి'

కాకినాడ సిటీ, జూలై 10: కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలిలో భాగంగా ఏపీఐఐసీ తొండంగి మండలంలో దళితుల నుంచి సేకరించిన భూములకు త్వరితగతిన నష్టపరిహారం ఇప్పించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడి చెంగల్‌రావు కలెక్టర్‌ను కోరారు. కోదాడ కొత్తపాకలు, ఒంటిమామిడి, శృంగవృక్షం గ్రామాలకు చెందిన దళిత రైతుల నుంచి సేకరించిన 205 ఎకరాలకు నష్ట పరిహారం చెల్లింపునకు ప్రొసీడింగ్ ఆర్డర్స్‌నోటీసులందుకున్న రైతులతో కలెక్టర్‌ను కలిసి వినతి సమర్పించారు.



నిర్వాసితులతో కలిసి మాట్లాడుతున్న చెంగల్‌రావు

ఆదమరిస్తే అంతే సంగతులు!

» ప్రధాన రహదారిపై భారీ గొయ్యి » పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు



కరప: వేములవాడ ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీగొయ్యి, (ఇన్‌సెట్లో గొయ్యిపై దుంగ)

కరప, జూలై 10: కరప మండలం వేములవాడలో ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గొయ్యి ప్రమాదాలకు నిలయంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే కాకినాడ-రామచంద్రపురం ప్రధాన రహదారిని గతేడాది ఆధునీకీకరించారు. అయితే పలుచోట్ల రహదారి దెబ్బతిని ప్రమాదభరితంగా మారింది. ముఖ్యంగా వేములవాడ వద్ద ఉన్న భారీ గుంత వల్ల ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో ఈ గుంత కనిపించక పలువురు వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. ఇక్కడ గుంత ఉందని తెలియడానికి దానిపై ఒక ఈతచెట్టు దుంగను పెట్టారు. అయితే చీకట్లో రాకపోకలు సాగిస్తున్నవారు ఈ దుంగను గుద్ది పడిపోతున్నారని పలువురు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్అండ్‌బీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని వారు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గుంతలను పూడ్చి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

రోడ్డు మధ్యలో కల్వర్టు

సర్పవరం జంక్షన్, జూలై 10: కాకినాడ రూరల్ రమణయ్యపేట ఏపీఎస్పీ పక్కన ఉన్న ఈశ్వర్‌నగర్ కెళ్లే ప్రవేశ మార్గం వద్ద అసంపూర్తిగా కల్వర్టుని వదిలేయడంతో పలు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి రోడ్డు విస్తరణ కోసం పోరాటం చేస్తే 4 నెలల కిందట రోడ్డు విస్తరణకు అవరోధంగా ఉన్న ఆక్రమణలు తొలగించిన అధికారులు, రోడ్డు మధ్యలో కల్వర్టుకి రక్షణ చర్యలు చేపట్టకుండా అసంపూర్తిగా వదిలేయడంతో నిత్యం రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయిని స్థానికులు చెబుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సర్పవరం జంక్షన్: రోడ్డు మధ్యలో అసంపూర్తిగా వదిలేసిన కల్వర్టు పైభాగం

'బాలల అభివృద్ధికి చర్యలు'



ప్రత్తిపాడు ధర్మవరంలో భవిత కేంద్రంలో బాలల విద్యా సామర్థ్యాలు పరిశీలిస్తున్న అధికారులు

ప్రత్తిపాడు, జూలై 10: రాష్ట్రంలోని భవితా కేంద్రాల్లోని దివ్యాంగుల బాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర ఇన్‌క్యూజివ్ ఎడ్యుకేషన్ కన్సల్టెంట్ వై.నరసింహారావు తెలిపారు. మండలంలో ధర్మవరంలో భవితా కేంద్రాన్ని బుధవారం సమగ్ర శిక్ష జిల్లా సీఎంవో చామంతి నాగేశ్వరరావుతో కలిసి ఆయన సందర్శించారు. పిల్లలకు ఇచ్చిన ట్యాబ్‌లు వారు ఎలా ఉపయోగిస్తున్నారో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. భవితా కేంద్రాల్లోని శిక్షణ పొందుతున్న స్వల్ప, అతిస్వల్ప దివ్యాంగ బాలలను సాధారణ విద్యార్థులతో మమేకమయ్యేలా భవితా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ధర్మవరం భవితా కేంద్రంలో ఫిజియోథెరపీ డాక్టర్‌ను నియమించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు, ఎంఈవో2 వై.అచ్చిరాజు, సీఆర్పీ రాంజీ ప్రసాద్, జడ్పీహై స్కూల్, భవితా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ఏలేశ్వరం: పట్టణంలో భవితా కేంద్రాన్ని రాష్ట్ర ఇన్‌క్యూజివ్ ఎడ్యుకేషన్ కన్సల్టెంట్ వై.నరసింహారావు పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల నమూనాలు, బోధనోపకరణాలు, కంప్యూటర్, విద్య సందర్శించారు. ఫిజియోథెరఫీ, రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష జిల్లా సీఎంవో చామంతి నాగేశ్వరరావు, ఎంఈవో వరలక్ష్మీ, ఉపాధ్యాయురాలు సీహెచ్.వాణీ పద్మజ, పి.బుజ్జి తదితరులున్నారు.

'వాటర్‌ట్యాంక్‌లను నిర్మించాలి'



కొత్తపల్లి సర్వసభ్య సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారిని ప్రశ్నిస్తున్న ఎంపీటీసీలు

కొత్తపల్లి, జూలై 10: తీరప్రాంత గ్రామాలైన మాయాపట్నం, క్రీస్తునగరం ప్రాంతాలకు మంచినీరు సరఫరా చేసేందుకు శంకుస్థాపనలు చేసిన వాటర్‌ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. కొత్తపల్లి వైస్ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్ అధ్యక్షతన బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఉప్పాడ ఎంపీటీసీ బాధిన నాగేశ్వరరావు వాటర్ ట్యాంక్ నిర్మాణం విషయంలో ఆర్‌డబ్ల్యుఎస్ జేఈఈ సంధ్యను నిలదీశారు. తమ పంచాయతీ పరిధిలో ఇళ్లపన్నుల బకాయిల వసూలు కాక పోవడంతో సిబ్బంది జీతాలు ఇవ్వడం కష్టం ఉందని పంచాయతీ పాలకవర్గం తరపున వేమగిరి రాంబాబు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. జడ్పీటీసీ గుబ్బల తులసీ కుమార్, వైస్ ఎంపీపీ-2 మాదిరెడ్డి దొరబాబు,ఎంపీడీవో పి.వెంకటనారాయణ ఉన్నారు.

ఎన్జీవోస్ సభ్యత్వాల అందజేత

కాకినాడ సిటీ, జులై 10: రాష్ట్రత ప్రభుత్వం ఎన్జీవోస్ అసోసియేషన్ పరిధిలోని గెజిటెడ్ ఉద్యోగులను తీసుకురావడంతో ఎన్జీవోస్ అసోసియేషన్ నేతలు సభ్యత్వాలు అందజేత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ గుద్దటి రామ్మోహన్, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం డీటీవో, ఆర్అండ్‌బీ ఈఈ, లోకల్ ఫర్ ఆడిట్, పే అండ్ అకౌంట్స్ కార్యాలయాల్లో గెజిటెడ్ అధికారులను ఎన్జీవోస్ అసోసియేషన్‌లోకి ఆహ్వానించారు. గెజిటెడ్ ఉద్యోగులందరికీ సభ్యత్వాలు తీసుకోవాల్సిందిగా కోరారు. అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, సరెళ్ల చంద్రరావడు, కాకినాడ సిటీ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు అరదాడి సత్తిబాబు,రామకృష్ణ, కోశాధికారి సతీష్ ఉన్నారు.

లక్కీడీప్‌లో విజేతల ఎంపిక

కాకినాడ క్రైం, జూలై 10: ఆరోగ్య కార్యక్రమాల్లో ప్రతిభ కనబరచిన సిబ్బందికి ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా లక్కీడీప్ నిర్వహించి విజేతలను ఎంపిక చేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ నాగేశ్వర్‌నాయక్ తెలిపారు. బుధవారం కాకినాడ జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 ఏప్రిల్ వరకు జరిగిన ఆరోగ్య కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి లక్కీ డీప్ తీసి విజేతలను ప్రకటించారు. బహుమతులను గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం రోజున విజేతలకు నగదు బహుమతితోపాటు ప్రశంసాపత్రం అందిస్తామన్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ స్వప్న, డీఐవో డాక్టర్ రత్నకుమార్ ఉన్నారు.

'91శాతం ప్లేస్‌మెంట్లు'

కాకినాడ రూరల్, జూలై 10: కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడియల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు కళాశాలలో వివిధ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబరచి 91శాతం ప్లేస్‌మెంట్లు సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీకాంత్ తెలిపారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు, కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, డైరెక్టర్ జీవీకృష్ణంరాజు, ఏవో జీ.వర్మపీఆర్వో సాయిబాబు అభినందించారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తాం

కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు



జీజీహెచ్‌లో భవనాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

జీజీహెచ్(కాకినాడ), జూలై 10: కూటమి ప్రభుత్వంలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. కాకినాడ జీజీహెచ్‌లో ఆర్ఎంసీ పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మిస్తున్న మాతా శిశు విభాగం భవనం, పలు విభాగాలను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ మాతా శిశు విభాగం త్వరలోనే అందుబాటులోకి రానుందన్నారు. రామ్‌కోసా కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో భవన నిర్మాణం జరుగుతోందన్నారు. రంగరాయ వైద్యకళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ నార్త్ అమెరికా సహకారంతో రూ.30కోట్లతో భవన నిర్మాణం చేపట్టారన్నారు. 1150 పడకల ఆస్పత్రి అందుబాటులో ఉన్నప్పటికీ రోగులకు సరిపోవడం లేదన్నారు. మరో 500 పడకలతో ఈ మాతా,శిశు భవనం అందుబాటులోకి రానుందన్నారు. ఆస్పత్రి అభివృద్ధికి దాతలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, రామ్‌కోసా సభ్యులు డాక్టర్ చిట్ల కిరణ్‌కుమార్, డాక్టర్ తేజోకృష్ణ, డాక్టర్ కొండమూరి సత్యనారాయణ, డాక్టర్ అరుణ ఆదిత్య, డాక్టర్ ఆనంద్, డాక్టర్ కె.సత్యనారాయణ, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, జనసేన రాష్ట్ర కార్యదర్శి సంగిశెట్టి అశోక్, టీడీపీ నాయకులు గదుల సాయిబాబు, నల్లూరి శ్రీనివాస్, మల్లాడి గంగాధరం పాల్గొన్నారు.

ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ

కాకినాడ రూరల్, జూలై 10: కాకినాడ పీఆర్ ప్రభుత్వ వృత్తి విద్యా, జూనియర్ కళాశాలలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు కళాశాలలో బుధవారం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పుస్తకాలను అందజేశారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కళాశాలల ప్రిన్సిపాల్స్ జ్యోతుల రాంబాబు, ఎం.తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికార్లు శివప్రసాద్, నిరంజన్‌కుమార్, కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల ఆందోళనలు



సామర్లకోటలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

సామర్లకోట, జూలై 10: అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు సత్వరం పరిష్కరించాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సామర్లకోట మండల, పట్టణ పరిధిలో అంగనవాడీ కేంద్రాల సిబ్బంది సామర్లకోట తహశీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. యూనియన్ నాయకురాలు వడ్డి ఎస్తేరు రాణీ, టి.నాగమణి, జీ.మహాలక్ష్మి, ఏ.వాణీదేవి, టీవీఎస్. రత్నకుమారి, సీతారత్నం, వరలక్ష్మి, మంగతాయారు, అరుణ, ఎస్‌కె. ఫాతిమా సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ శ్రీనివాస్‌కు అందజేశారు.

ఏలేశ్వరం: అంగన్‌వాడీ,ఆశా వర్కర్స్‌కు కనీస వేతనాలు ఇవ్వాలని ఏలేశ్వరంలో ర్యాలీ నిర్వహించారు. ప్రత్తిపాడు ప్రాజెక్టు అధ్యక్షురాలు కాకరపల్లి సునీత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్.నాగలక్ష్మీ, బంగారుపాప, వెంకటలక్ష్మీ, సత్యవేణి, సూర్యకుమారి, పాల్గొన్నారు.

కరప: కరప తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, మిడ్డేమీల్ నిర్వాహకులు, స్వీపర్లు, భవననిర్మాణ కార్మికులు ఆందోళన చేపట్టారు. అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు పి.వీరవేణి, సెక్టార్ లీడర్లు ఎస్.వరలక్ష్మి, ఎం.భవానీ, ఎం. దేవి, కేవీ వెంకటలక్ష్మి, డి.దేవి, బి.అంజమ్మ, వి.లోవలక్ష్మి పాల్గొన్నారు.

తొండంగి: మండల రెవెన్యూ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్లు నిరసన ప్రదర్శన నిర్వహించారు. తుని ప్రాజెక్టు లీడ్ ప్రధాన కార్యదర్శి మేరీ సమాధానం, సెక్టార్ లీడర్స్ ఎస్ సుజాత,బి సుబ్బలక్ష్మి, ఎమ్ కామేశ్వరి తదితరులు ఉన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో భవన నిర్మాణ కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్యకర్తలు ప్రదర్శన ధర్నా నిర్వహించారు. ఆందోళనకు సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, కార్మిక సంఘాల నాయకులు సీరం సత్తిబాబు, అల్లాడి లక్ష్మి, హేమలత, వెంకటలక్ష్మి నాయకత్వం వహిం చారు.

పెద్దాపురం: డిమాండ్స్ డే సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు దారపురెడ్డి క్రాంతికుమార్, కార్యక్రమంలో గడిగట్ల సత్తిబాబు, సిరిపురపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాళ్లరేవు: తాళ్లరేవు అంగన్వాడీ వర్కర్స్‌హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు, ఆశావర్కర్లు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ తాళ్లరేవుశాఖ అధ్యక్షురాలు సీహెచ్. పద్మజ, సంఘం నాయకురాళ్లు పెయ్యల అనంతలక్ష్మి, రాయుడు నాగలక్ష్మి, ఆదిలక్ష్మి ఉన్నారు.

పిఠాపురం: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.పద్మ, సీహెచ్.రమాప్రభ, సీఐటీయూ నాయకులు కుంచే చిన్నా, వీరబాబు, విజయశాంతి,భవానీ ఉన్నారు.

గొల్లప్రోలు: అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు గొల్లప్రోలు తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్ యూనియన్, సీఐటీయూ నాయకులు టి.తులసిదేవి, సత్యవతి, నందీశ్వరరావు, కె.చిన్న పాల్గొన్నారు.

అపర్ణాదేవి ఆలయ తాళాల అప్పగింతపై ఆందోళన



అపర్ణాదేవి ఆలయం వద్ద అందోళన నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

గొల్లప్రోలు రూరల్, జూలై 10: గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయంతో పాటు వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ కమిటీల నిర్వహణను ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలు చేపట్టడం అనవాయితీగా వస్తున్నది. పిఠాపురం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో ఇప్పటి వరకూ కమిటీ బాధ్యతలు చూసిన వారు ఆలయ తాళాలు, రికార్డులను కొద్దిరోజుల క్రితం జనసేన నేతలకు అప్పగించారు. రాష్ట్రంలో తాము అధికారంలో ఉన్నామని అప్పుడు టీడీపీ నేతలు ఆందోళన నిర్వహించారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అప్పట్లో ఆలయాల తాళాలను వీఆర్వో, పోలీసు సిబ్బందికి అప్పగించారు. అప్పటి నుంచి కమిటీల ఏర్పాటుపై టీడీపీ, జనసేనవర్గాలు మల్లగుల్లాలు పడుతూనే ఉన్నాయి. ఈ వివాదం కొనసాగుతుండగానే పోలీసు, రెవెన్యూ సిబ్బంది తమ వద్ద ఉన్న తాళాలను బుధవారం జనసేన నేత కుంపట్ల సత్యనారాయణ తదితరులకు అప్పగించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా సత్యనారాయణ, కమిటీ సభ్యులు బాధ్యతలు చేపట్టారు. కమిటీల్లో ప్రాతినిధ్యం లేకుండా చేయడంపై టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన నేతలు, అధికారుల తీరుని నిరసిస్తూ అపర్ణాదేవి ఆలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఆందోళనలో టీడీపీ నేతలు విశ్వనాధుల సుబ్బరామకృష్ణ, చిట్టూరి సుబ్బారావు, గోకరకొండ నారాయణస్వామి, బండారు రామారావు, గారపాటి సుబ్రహ్మణ్యం ఉన్నారు.

'దొంగను పట్టుకుని అప్పగిస్తే వదిలేశారు'

పిఠాపురం, జూలై 10: ఇంటిలో చోరీకి పాల్పడిన వ్యక్తిని పట్టుకుని పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌కు పట్టుకువెళ్లి అప్పగిస్తే వదిలివేశారు. అప్పుడు ఎన్నికల సమయం అంటూ సాకులు చెప్పిన పోలీసులు 43రోజులు గడిచినా నేటికి కేసు నమోదు చేయలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని జగ్గయ్య చెరువు కాలనీలో గుళ్లింకల మురళీకృష్ణమ్మ, ఈశ్వరరావు దంపతులు నివాసం ఉంటున్నారు. వారి ఇంటి వద్ద సిమ్మెంటు పనిచేసేందుకు ఒక వ్యక్తి వచ్చేవాడు. అతడు వారు ఇంటిలో లేని సమయంలో మారుతాళాలు ఉపయోగించి రూ.50వేలు నగదు, 2కాసుల బంగారం ఉంగరాలు, సెల్‌ఫోన్ చోరీ చేశాడు. విషయాన్ని గుర్తించిన మురళీకృష్ణమ్మ, ఈశ్వరరావు సదరు వ్యక్తిని పట్టుకుని మే 29న పిఠాపురం పోలీసులకు అప్పగించారు. అప్పట్లో ఎన్నికల సమయం కావడంతో వదిలివేశామని చెప్పారని, నేటికి కనీసం కేసు నమోదు చేయలేదని, తమకు న్యాయం చేయాలని కోరారు.

హైస్కూల్ ప్లస్‌ను సద్వినియోగం చేసుకోవాలి : డీఈవో రమేష్



విద్యార్థి అభ్యసన స్థాయిని తెలుసుకుంటున్న డీఈవో

పెద్దాపురం, జూలై 10: నూతనంగా మంజూరు కాబడిన హైస్కూల్ ప్లస్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈవో పిల్లి రమేష్ అన్నారు. మండలంలోని కాండ్రకోట ప్రజాపరిషత్ పాఠశాలను ఆయన బుధవారం సందర్శించి విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. పాఠశాలలో వసతులపై ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ అందరూ సమిష్టిగా విద్యాభివృద్ధికి తోడ్పడాలన్నారు. పాఠశాల రికార్డులను తనిఖీచేశారు. డీసీఈబీ కార్యదర్శి వెంకట్రావు, ఎంఈవో ప్రభాకరశర్మ, హెచ్ఎం మూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు కలెక్టర్ అభినందన

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 10: ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం పెదగంట్యాడలో గతనెల 8, 9న జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఏట్ లిఫ్ట్ చాంపియన్‌షిప్‌లో 195 కిలోల విభాగంలో ఏపీఎస్ఆర్టీసీ కాకినాడ డిపో డ్రైవర్‌గా పనిచేస్తున్న మండపల్లి శ్రీనివాసరావు ప్రథమస్థానంలో నిలవడంతో గోల్డ్‌మెడల్, ప్రశంసపత్రాన్ని గెలుచుకున్నారు. పవర్ లిఫ్టింగ్ బ్యాక్ స్క్వాడ్‌లో 180 కిలోల విభాగంలో ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాసరావును జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తూ క్రీడల్లో రాణించడం ప్రశంసనీయమన్నారు.

హెల్మెట్ వినియోగంపై ర్యాలీ

పెద్దాపురం, జూలై 10: హెల్మెట్ వినియోగంపై పట్టణంలో బుధవారం అవగాహన ర్యాలీని రవాణా, పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టాగా డీఎస్పీ కె.లతాకుమారి జండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ రవాణాశాఖ కార్యాలయం నుంచి ప్రారంభమై ప్రధాన వీధుల గుండా సాగింది. కార్యక్రమంలో ఎంవీఐ మేడపాటి హరినాథరెడ్డి, ఎస్ఐ వెలుగుల సురేష్, జిల్లా మానవహక్కుల సంఘం అధ్యక్షుడు నూతులపాటి అప్పలకొండ, న్యాయవాదులు మడికి రాంబాబు, సకురు దుర్గారావు, అత్తిలి ప్రభూజీ తదితరులు పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన

గండేపల్లి, జూలై 10: మండలంలోని తాళ్ళూరు గ్రామంలో జడ్పీహెచ్ పాఠశాలలో ఐసీడీఎస్, ఐసీపీఎస్ ఆధ్వర్యంలో బాలల హక్కుల చట్టాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఎం.పూర్ణిమ అధ్యక్షతన జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గరాణి, ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగపార్వతి మాట్లాడారు. బాల్య వివాహాలు, బాల హక్కులు, అక్రమ రవాణా, బాలలపై వేధింపుపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం కెవివి సత్యనారాయణ, హెల్త్ డిపార్టుమెంట్, అంగన్వాడీలు పాల్గొన్నారు.

'పిల్లలను పనికి పంపించవద్దు'

గండేపల్లి, జూలై 10: బడి ఈడు పిల్లలను పనికి పంపించి వారి జీవితాన్ని నాశనంచేయొద్దని ఉప సర్పంచ్ జాస్తి వసంత్ అన్నారు. బుధవారం హెచ్ఎం అమ్మాజీ ఆధ్వర్యంలో మన బడికి పోదాం అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వసంత్ మాట్లాడుతూ చదువుకునే పిల్లలకు పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కుక్కల ఆనందబాబు, ఉండవిల్లి బుల్లిరాజు, కళాశాల సిబ్బంది, విద్యార్థులున్నారు.

పాడి రైతుల సమావేశం

ప్రత్తిపాడు, జూలై 10: పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా స్థానిక పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు కరెంటు కార్యాలయం వెనుక పామాయిల్ తోటలో బుధవారం పాడి రైతుల సమావేశం నిర్వహించారు. పలు అంశాలను పశుసంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్, పశు వైద్యాధికారులు డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ సతీష్, డాక్టర్ మంజూషా వివరించారు.పాడి రైతు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మరిడమ్మకు పంచామృతాభిషేకం

పెద్దాపురం, జూలై 10: స్థానిక మరిడమ్మ దేవస్థానంలో అమ్మవారి జన్మనక్షత్రం మఖను పురస్కరించుకుని బుధవారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. వేద పండితులు ఆధ్వర్యంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరాగా భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు. అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు, వేదపండితులున్నారు.

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏసు

జగ్గంపేట, జూలై 10: ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏసు ఎన్నికయ్యారు. జగ్గంపేటలో సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో ఉపాధ్యక్షుడిగా అరుణ్, ప్రధాన కార్య దర్శి మోహన్, సహాయ కార్యదర్శి రాఘవులు, కోశాధికారి టి.నాగేశ్వరరావు, కార్యవర్గసభ్యులుగా గుబ్బల ఆదినారాయణ, కుండల్ల పాపారావురెడ్డి,శంకర్, శ్రీను,గణేశం శ్రీను ఎన్నికయ్యారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

తాళ్లరేవు, జూలై 10: గోవలంక పంచాయతీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం టీడీపీ నేత మోహూరి శ్రీనివాసకిరణ్ నోటుపుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బోయిడి వేణుగోపాల్, కోరుకొండ రవి, కూరాటి రత్నకుమారి, ఉపాధ్యాయులు ఉన్నారు.

13న మండల పరిషత్ సమావేశం

పెద్దాపురం, జూలై 10: పెద్దాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 13 నిర్వహించనున్నట్టు ఎంపీడీవో మాదిరెడ్డి ఉషారాణీ తెలిపారు. ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు.

కుళాయిల ద్వారా కలుషిత జలాలు

గొల్లప్రోలు, జూలై 10: పట్టణంలో కుళాయిలు ద్వారా కలుషిత జలాలు సరఫరా కావడంతో ప్రజలు విస్మయానికి లోనయ్యారు. ఎస్సీ కాలనీ తదితర ప్రాంతాల్లో బుధవారం కుళాయిల ద్వారా రంగు మారిన నీరు వచ్చింది. నీరు వాసన కూడా వస్తున్నదని ప్రజలు తెలిపారు. ఈ నీరు తాగితే రోగాలు ప్రబలుతాయని, కొద్ది రోజులుగా తాగునీటి సరఫరా ఇదేటవిధంగా ఉంటున్నదని వారు పేర్కొన్నారు.



గొల్లప్రోలులో కలుషిత నీరు